నమస్తే తెలంగాణ
మహబూబ్‌నగర్
నారాయణపేట
5 | మహబూబ్‌నగర్, గురువారం 18 జనవరి 2024 | MAHABUBNAGAR NARAYANPET

పాలమూరుపై గురి

- నేడు మహబూబ్‌నగర్ పార్లమెంట్ ఎన్నికలపై చర్చ
- అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమిపై రివ్యూ
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమక్షంలో సమీక్షా సమావేశం
- హాజరుకానున్న ఎంపీ, జెడ్పీ చైర్మన్లు, ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు



మహబూబ్‌నగర్, జనవరి 17 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): మహబూబ్‌నగర్ పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ గెలుపే లక్ష్యంగా బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలను సమాయత్తం చేసేందుకు రెడీ అవుతున్నారు. అందులో భాగంగా గురువారం తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆధ్వర్యంలో జరిగే సమీక్షా సమావేశానికి పార్టీ నేతలు తరలివెళ్తున్నారు. నియోజకవర్గాల వారీగా జరిగే ఈ సమీక్షా సమావేశాల్లో సిట్టింగ్ ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి, మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, జెడ్పీ చైర్మన్లు, మున్సిపల్ చైర్మన్లు, జెడ్పీటీసీలు, ఎంపీపీలతో పాటు వివిధ కార్పొరేషన్ల మాజీ చైర్మన్లు కూడా పాల్గొంటున్నారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ అనుసరించాల్సిన వ్యూహాలపై నేతలకు కేటీఆర్ దిశానిర్దేశం చేయనున్నారు. బుధవారం నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ ఓటమిపై కూడా నేతల నుంచి అభిప్రాయాలు సేకరిస్తారు. వచ్చే ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహం అధికార పార్టీని ఇరుకున పెట్టే అంశాలను పరిశీలించి పోరాటానికి సమాయత్తం కావాలని కేటీఆర్ పిలుపునివ్వనున్నారు. క్షేత్రస్థాయిలో కార్యకర్తలను బలోపేతం చేసి వారికి భరోసా కల్పించే దిశగా నేతలు ఇప్పటినుంచే ప్రయత్నాలు చేస్తున్నారు. మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు ఇప్పటికే పార్టీ క్యాడర్ జారిపోకుండా కాపాడుతున్నారు. ఈ నేపథ్యంలో గురువారం జరిగే సమావేశం కీలకంగా మారనున్నది. ఈ సమావేశంతో అధికార పార్టీతో పాటు బీజేపీ నాయకుల గుండెల్లో దడ మొదలైంది.

లోక్‌సభలో హ్యాట్రిక్.. నాలుగోసారి లక్ష్యంగా..

మహబూబ్‌నగర్ పార్లమెంట్ స్థానం తెలంగాణ ఆవిర్భవించాక గులాబీ కంచుకోటగా మారింది. 2009లో ఉద్యమ సమయంలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మహబూబ్‌నగర్ పార్లమెంట్ స్థానం నుంచి పోటీ చేసి విజయం సాధించారు. మహబూబ్‌నగర్ ఎంపీగానే ఉద్యమనేత కేసీఆర్ తెలంగాణను సాధించారు. తెలంగాణ రాష్ట్రానికి తొలి ముఖ్యమంత్రిగా పదేండ్లపాటు ఉన్నారు. కేసీఆర్ వెంటే మహబూబ్‌నగర్ జిల్లా గులాబీ దళానికి కంచుకోటగా నిలిచింది. 2014, 2018 ఎన్నికల్లో కూడా బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించి సత్తా చాటారు. వరుసగా హ్యాట్రిక్ విజయాలు అందించిన మహబూబ్‌నగర్ ప్రజలు ఈసారి కూడా లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను ఆదరిస్తారనే ధీమాతో ఉన్నారు.

హాజరుకానున్న బీఆర్ఎస్ శ్రేణులు

మహబూబ్‌నగర్ పార్లమెంట్ సమీక్షా సమావేశానికి సిట్టింగ్ ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డితో సహా మాజీ మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణమ్మ, మున్సిపల్ చైర్మన్లు, వైస్ చైర్మన్లు జెడ్పీటీసీలు, ఎంపీపీలు, ఎంపీటీసీలు, మాజీ కార్పొరేషన్ చైర్మన్లు సమావేశానికి హాజరు కానున్నారు. నియోజకవర్గాల వారీగా జరిగే సమీక్షలు పార్టీని మరింత ముందుకు తీసుకెళ్లడానికి ఉపయోగపడతాయని మహబూబ్‌నగర్ బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు లక్ష్మారెడ్డి అన్నారు. మహబూబ్‌నగర్ పార్లమెంట్ పరిధిలో కాంగ్రెస్‌ను గెలిపించి తప్పు చేశామని ప్రజలు భావిస్తున్నారని, 45 రోజుల పాలనలోని అధికార పార్టీ విఫలమైందని విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయని, ఈ నేపథ్యంలో లోక్‌సభ ఎన్నికల్లో మహబూబ్‌నగర్‌లో మరోసారి బీఆర్ఎస్ జెండా ఎగరడం ఖాయమని పేర్కొన్నారు.

కందులు @ రూ.8,822

జడ్చర్ల, జనవరి 17 : బాదేపల్లి వ్యవసాయ మార్కెట్‌యార్డులో క్రయవిక్రయాలు జోరుగా సాగుతున్నాయి. బుధవారం కందులకు అత్యధికంగా క్వింటాకు రూ.8,822 ధర పలికింది. కందులు, ధాన్యం, వేరుశనగ, పత్తి, అమ్మకానికి వచ్చాయి. 36 క్వింటాళ్ల కందులు అమ్మకానికి రాగా, క్వింటాకు గరిష్ఠంగా రూ.8,822, కనిష్ఠంగా రూ.8,732, మధ్యస్తంగా రూ.8,792 ధర పలికింది. అదేవిధంగా 78 క్వింటాళ్ల ఆర్ఎన్ఆర్ రకం ధాన్యం అమ్మకానికి రాగా, క్వింటాకు గరిష్ఠంగా రూ.3,126 ధర రాగా, కనిష్ఠంగా రూ.2,729, మధ్యస్తంగా రూ.2,818 ధర పలికింది. 9 క్వింటాళ్ల హంసధాన్యం అమ్మకానికి రాగా, క్వింటాకు గరిష్ఠంగా రూ.1,960 ధర పలికింది. 2,200 క్వింటాళ్ల వేరుశనగ అమ్మకానికి రాగా, క్వింటాకు గరిష్ఠంగా రూ.7,761, అదేవిధంగా 34 క్వింటాళ్ల పత్తి అమ్మకానికి రాగా, క్వింటాకు గరిష్ఠంగా రూ.6,789ధర పలికింది.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు

అధైర్యపడొద్దు..

- కార్యకర్తలు కోరుకున్నదే జరుగుతుంది..
- ఊపిరి ఉన్నంత వరకు మట్టి మనుషుల కోసం పోరాటం
- ఐదేండ్లలోపే కాంగ్రెస్ ప్రభుత్వాలపై వ్యతిరేకత
- బడ్జెట్‌కు మించి హామీలు ఇచ్చిన కాంగ్రెస్
- వంద రోజులు కాలేదని ఆగుతున్నాం
- పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలిస్తే తెలంగాణకు లాభం
- ప్రజలే బీఆర్ఎస్ నేతలను రావాలని పిలుస్తారు
- నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సమీక్షా సమావేశంలో సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు

నాగర్‌కర్నూల్, జనవరి 17 (నమస్తే తెలంగాణ) : 'మనం ఉద్యమ వీరులం.. కార్యశూరులం.. ఉద్యమానికి ఊపిరిలూదిన వాళ్లం.. పేగులు తెగేదాకా మన మాతృభూమి కోసం కొట్లాడిన వాళ్లం.. మనకు సత్తువ ఉంది.. సత్తా ఉంది.. మన పార్టీ స్థానం మారింది.. పాలన నుంచి ప్రతిపక్షానికి వచ్చాం.. ప్రతిపక్షంలో ఉండి కూడా మన మట్టి మనుషుల ఆకాంక్షల కోసం ఊపిరి ఉన్నంత వరకు పోరాడుదాం.. తెలంగాణ సమస్యలు, విభజన సమస్యలు పరిష్కారం కావాలంటే ఈ పార్లమెంట్ ఎన్నికల్లో గెలిచి ఢిల్లీలో బీఆర్ఎస్ ఉండి తీరాల్సిన సమయం ఇదే' అని సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అన్నారు. హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గస్థాయి సమీక్షా సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఎన్నికల ఫలితాల తర్వాత నెల రోజులకే సమీక్ష, సన్నాహక సమావేశాలు ప్రారంభించామని, ఇది 11వ సమావేశమని, ఇప్పటివరకు ఊహించినదానికన్నా విలువైన సూచనలు వచ్చాయన్నారు. కార్యకర్తలు కోరుకుంటున్నదే రాబోయే రోజుల్లో జరుగుతుందన్నారు. కార్యకర్తల అభిప్రాయం మేరకే పార్టీ పని చేస్తుందన్నారు. తెలంగాణ అభివృద్ధి కోసం రేయింబవళ్లు తండ్లాడామని, కానీ అసెంబ్లీ ఎన్నికల్లో తడబడ్డామన్నారు. ఇప్పుడు మన పార్టీ స్థానం మారిందని, పాలన నుంచి ప్రతిపక్షానికి వచ్చామని, అయినా అధైర్యపడాల్సిన అవసరం లేదన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వాలు మారడానికి బలమైన కారణాలు అక్కర్లేదన్నారు. సోషల్ మీడియాలో దుష్ప్రచారాల కాలంలో ప్రభుత్వం మారడానికి ప్రజలకు పనికొచ్చే అంశాలు కూడా ఉండనక్కర్లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ వరుసగా పదేండ్లు పాలించిన సందర్భాలు చాలా అరుదని, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్‌లో ఐదేండ్లకే ప్రభుత్వాలు మారాయన్నారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు కావాలంటే ఏడాదికి రూ. మూడున్నర లక్షల కోట్ల బడ్జెట్ కావాలని, మన బడ్జెట్ మాత్రం రూ.2.90 లక్షల కోట్లే అన్నారు. అధికారం ఎలాగూ రాదని అరచేతిలో వైకుంఠం చూపేలా మోసపూరిత హామీలతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్నారు. ఎన్నికలప్పుడు ఇష్టమొచ్చినట్లు మాట్లాడి, ఇప్పుడు అవసరం లేని విషయాలు తెరపైకి తీసుకొస్తున్నారన్నారు. కాంగ్రెస్ గ్యారెంటీల చావు వార్త చెప్పే రోజులు ఎంతో దూరంలో లేదన్నారు. ఈ పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలిస్తే తెలంగాణ సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్నారు. విభజన సమస్యలు, తెలంగాణ సమస్యలకు పరిష్కారం రావాలంటే ఈ కీలక సమయంలో ఢిల్లీలో బీఆర్ఎస్ ఎంపీలు లేకుంటే తెలంగాణకు నష్టం కలుగుతుందన్నారు. అసెంబ్లీ ఎన్నికల ఫలితాలను గుణపాఠంగా తీసుకొని ముందుకు సాగుదామని, పార్లమెంట్ ఎన్నికల్లో సత్తా చాటుదామని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతలకు జాతీయ హోదా ఇవ్వలేమని బీజేపీ ప్రభుత్వం చేతులెత్తేసిందని, కాంగ్రెస్ 11వ హామీ కింద చేర్చిందని విమర్శించారు. కేంద్రం మెడలు వంచేది పోయి కాంగ్రెస్ నాయకులు రోజూ బీజేపీ నాయకుల మెడలకు దండలు వేస్తున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వాలు, ప్రాంతీయ పార్టీలను చీల్చిన చరిత్ర బీజేపీదే అన్నారు. మన ఎమ్మెల్యేలను కొనుగోలు చేసేందుకు ప్రయత్నించి బీజేపీ బ్రోకర్లు రెడ్ హ్యాండెడ్‌గా దొరికారన్నారు. శ్వేతపత్రం పేరిట మనల్ని బద్నాం చేసే ప్రయత్నం చేసి తీసిన గోతిలోనే కాంగ్రెస్ పడిందన్నారు. సంక్షేమం, అభివృద్ధిని జోడెద్దుల్లా కేసీఆర్ ప్రభుత్వం కొనసాగించడం వల్లే గత పదేండ్లలో తెలంగాణలో 83శాతం పేదరికం తగ్గిందన్నారు. ప్రశాంతంగా ఉన్న రాష్ట్రంలో కాంగ్రెస్ హత్యారాజకీయాలు మొదలు పెడుతోందని ధ్వజమెత్తారు. ఇది మంచి పద్ధతి కాదని, మార్చుకోవాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ఇంకా వంద రోజులు కాలేదని, అందుకే ఆగుతున్నామ ని, లేకపోతే చీల్చిచెండాడే వాళ్లమన్నారు కొన్ని రోజులైతే ప్రజలే ఇండ్లల్లో ఉన్న బీఆర్ఎస్ నేతలను రండి రండి అంటూ బయటకు తీసుకొస్తారన్నారు. అంతకుముందు పలువురు ప్రజాప్రతినిధులు, మాజీలు, పార్టీ రాష్ట్ర, జిల్లా, మండల నాయకులు తమ అభిప్రాయాలను వివరించారు. కాగా సమావేశంలో మాజీ మంత్రులు సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, వేముల ప్రశాంత్‌రెడ్డి, నాగం జనార్దన్‌రెడ్డి, మాజీ స్పీకర్లు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, మధుసూదనాచారి, ఎంపీ పోతుగంటి రాములు, ఎమ్మెల్సీ గోరటి వెంకన్న, జోగుళాంబ గద్వాల, అలంపూర్ ఎమ్మెల్యేలు బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, విజయుడు, మాజీ ఎమ్మెల్యేలు మర్రి జనార్దన్‌రెడ్డి, గువ్వల బాలరాజు, బీరం హర్షవర్ధన్‌రెడ్డి, జైపాల్‌యాదవ్, సీనియర్ నేతలు రావుల చంద్రశేఖర్‌రెడ్డి, బైకని శ్రీనివాస్‌యాదవ్, జక్కా రఘునందన్ రెడ్డి, నాగం శశిధర్‌రెడ్డి, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల నాయకులు, ప్రజాప్రతినిధులు ఉన్నారు.



సమావేశానికి హాజరైన బీఆర్ఎస్ కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు

బీచుపల్లి పుష్కరఘాట్ వద్ద కృష్ణానదిలో పేరుకుపోయిన చెత్త

కృష్ణాతీరం.. చెత్తమయం

- బీచుపల్లి పుష్కరఘాట్‌లో లోపించిన పారిశుధ్యం
- ఇబ్బందులు పడుతున్న భక్తజనం • పట్టించుకోని అధికారులు
- నది పవిత్రతను కాపాడాలని కోరుతున్న ప్రజానీకం

ఇటిక్యాల, జనవరి 17 : పవిత్రమైన బీచుపల్లి క్షేత్రానికి పక్కనే కృష్ణానది ఉన్నది. అక్కడున్న పుష్కరఘాట్‌లో పారిశుధ్యం కొరవడడంతో ఈ క్షేత్రానికి వచ్చే భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రస్తుతం కృష్ణానదిలో అంతంతమాత్రంగా ఉన్న నీటి లభ్యతతో పిల్లకాల్వను తలపిస్తూ ప్రవహిస్తున్న నదిలో విడిచినపాత దుస్తులు, చెప్పులు, పూలదండలు, ప్లాస్టిక్ సంచులు దేవుని చిత్రపటాలు, అస్థికలు కలగలిసి మురుగు కాల్వను తలపించేలా నది పవిత్రతను పాడు చేస్తున్నాయి. ముఖ్యంగా మాలధారణ చేసిన భక్తులు మాలధారణ పూర్తి కాగానే ధారణ సమయంలో ధరించిన దుస్తులను నదిలో విడవడం, అలాగే కర్మఖాండల నిమిత్తం క్షేత్రానికి వచ్చేవారి వారి వెంట సంచులలో వివిధ రకాల వస్తువులను తీసుకొని అస్థికలతోపాటు వదలడంతో నదిలో రోజురోజుకూ చెత్తాచెదారం నిండిపోతున్నది. వ్యర్థాలు అన్నీ నదీ ప్రవాహం ఎక్కువగా ఉన్నప్పుడు ప్రవాహ వేగానికి కొట్టుకుపోయేవి. ప్రస్తుతం వేసవి సమీపిస్తుండడంతో నది అంతంత మాత్రంగా ప్రవహిస్తున్నది. దీంతో పుష్కరఘాట్ మెట్లపై నదీ రాళ్ల మధ్య వ్యర్థాలన్నీ ఇరుక్కు పోవడంతో వివిధ ప్రాంతాల నుంచి బీచుపల్లి దర్శనానికి వచ్చే భక్తులు నదీ స్నానాలు ఆచరించేందు కు, పూజలు నిర్వహించేందుకు ఇబ్బందికరంగా మారింది. నదిలో పేరుకుపోయిన చెత్తకు తోడు సమీపంలో ఉన్న ఫ్యాక్టరీల నుంచి వెలువడే కాలుష్యం కూడా తోడవ్వడంతో నదీజలాలు మరింతగా కలుషితంగా మారాయి. దీంతో చాలామంది భక్తులు నదిలో స్నానం చేయకుండానే వెనుదిరిగే పరిస్థితులు ఏర్పడ్డాయి. అయితే దేవస్థానం వారు నిర్వహించే పుష్కరఘాట్ పారిశుధ్య పనులను కొన్ని రోజులుగా గ్రామ పంచాయతీ వారు నిర్వహించడం మొదలు పెట్టారు. ఇందుకు గానూ టోల్ వసూలు టెండర్ రూ.3.71 లక్షలకు టెండర్ దక్కించుకొన్న వ్యక్తి పుష్కరఘాట్‌కు వచ్చే వాహనాలకు బస్‌కు రూ.50, కార్లకు రూ.30 చొప్పున వసూల్ చేస్తున్నాడు. దీని నుంచి ఆదాయం బాగానే వస్తున్నా.. పుష్కరఘాట్‌లో నిత్యం చేపట్టాల్సిన పారిశుధ్య పనులను పట్టించుకోకపోవడంతో నిత్యం వేలాదిగా వచ్చే భక్తులకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. బీచుపల్లి క్షేత్రం పవిత్రతకు భంగం వాటిల్లేలా వ్యవహరిస్తున్న పంచాయతీ వారినుంచి దేవాలయం వారే పుష్కరఘాట్ పారిశుధ్య పనులు చేపట్టి నది పవిత్రతను కాపాడాలని భక్తులు కోరుకుంటున్నారు.

పారిశుధ్య చర్యలు చేపడుతాం..

నాలుగైదు రోజుల నుంచి రాత్రిపూట భక్తులు విపరీతంగా వస్తున్నారు. ముఖ్యంగా మాలధారణ చేసిన భక్తులు దుస్తులను నదీలో విడవడంతో చెత్త పేరుకుపోయిన మాట వాస్తవమే. అలాగే పండుగ ఉండడం వలన పారిశుధ్య పనులు చేసే సిబ్బంది రావడం లేదు. దీంతో నదిలో చెత్త మరింతగా పేరుకుపోయింది. వెంటనే సిబ్బందిని పురమాయించి చెత్తాచెదారం తొలగించేలా చర్యలు తీసుకుంటాం.

– రాజు, పంచాయతీ కార్యదర్శి, బీచుపల్లి

గడువు పొడిగింపు

పాలమూరు, జనవరి 17 : తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల ప్రతిభా (సీవోసీ) ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తు గడువు తేదీని ఈనెల 20 వరకు పొడిగించినట్లు గురుకుల ప్రాంతీయ సమన్వయ అధికారి ఫ్లారెన్స్‌రాణి బుధవారం ప్రకటనలో తెలిపారు. 2024 మార్చిలో పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థులు ఈ నెల 20వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ ప్రవేశ పరీక్ష ఫిబ్రవరిలో నిర్వహించనున్నట్లు తెలిపారు.

5వ తరగతిలో ప్రవేశానికి..

తెలంగాణ సాంఘిక సంక్షేమ, గిరిజన, వెనుకబడిన తరగతుల సంక్షేమ, సాధారణ గురుకులాల్లో 2024-25 సంవత్సరానికి సంబంధించి 5వ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తు తేదీని పొడిగించినట్లు అధికారి ఫ్లారెన్స్‌రాణి తెలిపారు. ఆన్‌లైన్‌లోనే దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ప్రవేశ పరీక్ష ఫిబ్రవరిలో నిర్వహించనున్నట్లు తెలిపారు.

తాగునీటి ఎద్దడి రావొద్దు

- అందుకనుగుణంగా ముందస్తు చర్యలు చేపట్టాలి
- అధికారులు పనితీరును మెరుగుపర్చుకోవాలి
- ఎక్సైజ్, పర్యాటక శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు
- హాజరైన ఎమ్మెల్యేలు మేఘారెడ్డి, వాకిటి శ్రీహరి

సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి జూపల్లి, చిత్రంలో ఎమ్మెల్యేలు, కలెక్టర్

వనపర్తి, జనవరి 17 : వేసవిలో తాగునీటి ఎద్దడి రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఎక్సైజ్, పర్యాటక శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా సమీకృత భవనంలో కలెక్టర్ తేజస్‌నందలాల్‌పవార్, ఎమ్మెల్యేలు మేఘారెడ్డి, వాకిటి శ్రీహరి, అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్‌తో కలిసి పలు శాఖల ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి మాట్లాడుతూ ఎండాకాలంలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా జిల్లా యంత్రాంగం ఇప్పటి నుంచే చర్యలు చేపట్టాలని సూచించారు. సరైన పర్యవేక్షణ లేకపోవడంతో చాలా గ్రామాలు, ఏజెన్సీ ప్రాంతాలకు మిషన్ భగీరథ నీళ్లు రావడం లేదన్నారు. ఏజెన్సీకి మిషన్ భగీరథ బిల్లులు ఇచ్చే ముందు పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులతోపాటు గ్రామ మహిళా సంఘాల అధ్యక్షుల సంతకాలు సైతం తీసుకోవాలని సూచించారు. పది రోజుల తరువాత మరోసారి సమీక్ష నిర్వహిస్తామని.. ఆలోగా వాస్తవ నివేదికలు తయారు చేసి ఇవ్వాలని ఆదేశించారు. గనులు, భూగర్భ శాఖకు సంబంధించిన మైన్స్, ఖనిజాలు ఎక్కడ వినియోగించారో, వాటి ఆదాయం ఎంతో పూర్తి నివేదిక ఇవ్వాలని చెప్పారు. అధికారులు తమ పనితీరు మెరుగుపర్చుకొని ప్రజల నుంచి ప్రశంసలు పొందాలన్నారు. ప్రభుత్వ ఆదాయానికి గండి పడకుండా, సర్కారు భూములు కబ్జా కాకుండా అధికారులు బాధ్యత తీసుకోవాలన్నారు. ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు ఆలోచనా విధానం, పని తీరు, బాధ్యతలు నిర్వర్తించడంలో స్పష్టమైన మార్పు కనబడాలన్నారు. ప్రభుత్వ అధికారులు ప్రజాసేవకులు అనే విషయాన్ని గుర్తించాలన్నారు. సమస్యలు విన్నంచుకోవడానికి వచ్చిన ప్రజలతో మర్యాదగా మసులుకోవాలని హితవు పలికారు. ఎమ్మెల్యేలు తూడి మేఘారెడ్డి, వాకిటి శ్రీహరి మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన అన్ని రకాల పనులను తిరిగి ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. జూరాల కుడి కాల్వ నుంచి యథావిధిగా సాగునీరు పారుతుందని.., ఎడమ కాల్వకు మాత్రం ఇబ్బందులు ఏర్పడ్డాయన్నారు. మక్తల్ నియోజకవర్గంలో ప్రస్తుత పంటకు కనీసం రెండు తడులకు సాగునీరందించేలా అధికారులను ఆదేశించాలని మంత్రిని కోరారు. కలెక్టర్ మాట్లాడుతూ ధరణిలో ఇప్పటివరకు 26,900 దరఖాస్తులు వచ్చాయని.. అందులో 23 వేలకు పైగా దరఖాస్తులను పరిష్కరించామని, 3,500 పెండింగ్‌లో ఉన్నాయని వివరించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ తిరుపతిరావు, ఏఎస్పీ తేజావత్ రాందాస్, ఆర్డీవో పద్మావతి, అధికారులు పాల్గొన్నారు.

విద్యుత్ కాంతుల్లో నిరంజన్ షాపలీ దర్గా

మత సామరస్యానికి ప్రతీక

- ప్రారంభమైన రంగాపూర్ జాతర

అచ్చంపేటరూరల్, జనవరి 17 : నల్లమల ప్రాంతంలో 700 ఏండ్ల చరిత్ర కలిగిన రంగాపూర్, హజ్రత్ నిరంజన్ షేక్ షా వలీ దర్గా ఉత్సవాలు బుధవారం అర్ధరాత్రి నుంచి ప్రారంభమయ్యాయి. కులమతాలకు అతీతంగా హిందూ, ముస్లింలు ఉత్సవాలను నిర్వహించుకోవడం అనాదిగా వస్తున్నది.

హజ్రత్ నిరంజన్ షేక్ షా వలీ దర్గాకు మొదట అమ్రాబాద్ ప్రాంతం నుంచి గంధం నిర్వహించేవారు. స్వాతంత్ర్యం అనంతరం నిజాం పాలన అంతమై పటేల్, పట్వారీల వ్యవస్థ మొదలవ్వడంతో అచ్చంపేట పట్టణంలోని నారాయణపటేల్ వంశీయుల ఇంటి నుంచి గంధం ఉత్సవాలు చేపడుతున్నారు. ఉత్సవాలకు వచ్చే భక్తులకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు దర్గాతండా సర్పంచ్ సక్రిబాయిలచ్చునాయక్, రంగాపూర్ సర్పంచ్ లోక్యానాయక్ తెలిపారు. బుధవారం రాత్రి గంధోత్సవం, గురువారం ఖవ్వాలి, దీపారాధన, 19 న జ్యారత్ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. రంగాపూర్ జాతర, ఉర్సుకు స్థానిక ఎమ్మెల్యే వంశీకృష్ణ ముఖ్యఅతిథిగా హాజరవుతారని నిర్వాహకులు తెలిపారు. జాతర సందర్భంగా రంగాపూర్‌తో పాటు ఉమా మహేశ్వరం కొండపైకి ఆరు బస్సులను నడుపుతున్నామని అచ్చంపేట డిపో మేనేజర్ మురళి దుర్గాప్రసాద్ తెలిపారు.

భారీ బందోబస్తు..

రంగాపూర్ జాతర, ఉమామహేశ్వర బ్రహ్మోత్సవాల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా పోలీసులతో గట్టి బందోబస్తు ఏర్పాటు చేసినట్లు అచ్చంపేట డీఎస్పీ కృష్ణకిశోర్ తెలిపారు.

కృష్ణా బ్రిడ్జి మరమ్మతులు షురూ

- వాహనాల దారి మళ్లిస్తున్న అధికారులు
- ఇరువైపులా బారికేడ్లు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేసిన పోలీసులు

ఊట్కూర్ (కృష్ణ) జనవరి 17 : తెలంగాణ, కర్ణాటక సరిహద్దులో ఉన్న కృష్ణానదిపై నిజాం నవాబు కాలంలో నిర్మించిన బ్రిడ్జి మరమ్మతులను బుధవారం ప్రారంభించారు. దీంతో బ్రిడ్జిపై వాహనాల రాకపోకలను ఇరు రాష్ట్రాల అధికారులు నిలువరించారు. తెల్లవారుజామున 5 గంటల నుంచే బ్రిడ్జికి రెండు వైపులా ఇటు తెలంగాణ అటు కర్ణాటక పోలీసులు బారికేడ్లను ఏర్పాటు చేశారు. హైదరాబాద్ నుంచి కర్ణాటక రాష్ట్రం రాయిచూర్‌కు చేరుకునేందుకు జడ్చర్ల వయా భూత్పూర్, కొత్తకోట, ఎర్రవల్లి, గద్వాల మీదుగా వాహనాలను దారి మళ్లిస్తున్నారు. మహబూబ్‌నగర్ నుంచి రాయిచూర్ వెళ్లే వాహనాలను నారాయణపేట జిల్లా మరికల్ మండల కేంద్రం నుంచి అమరచింత, వయా జూరాల డ్యాం, గద్వాల నుంచి వెళ్లేలా అధికారులు ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. హైదరాబాద్ నుంచి రాయిచూర్‌కు వెళ్లే ఆర్టీసీ బస్సులను సైతం కృష్ణ మండలం టైరోడ్డు వరకు మాత్రమే నడిపిస్తుండగా అక్కడి నుంచి బ్రిడ్జిపై ప్రయాణికులు కాలి నడకతో దాదాపు 3 కిలోమీటర్లు నడుచుకుంటూ కర్ణాటక పరిధిలోని దేవసూగూర్‌కు చేరుకుంటున్నారు. దేవసూగూర్ నుంచి తెలంగాణలోకి ప్రవేశించేందుకు ప్రయాణికులు ఇదే వంతెనపై కాలినడన టైరోడ్డుకు చేరుకొని అక్కడి నుంచి వాహనాల్లో గమ్యస్థానాలకు చేరుకుంటున్నారు. మరోవైపు పరిసర ప్రాంతాల నుంచి ప్రయాణికులు రాయిచూర్‌కు వెళ్లేందుకు హిందూపూర్, కడేచూర్, సైదాపూర్, గూడూర్, గూగళ్, గబ్బూర్ మీదుగా వాహనాలను తరలించేందుకు పోలీసులు రూట్ మ్యాప్ ప్రదర్శించారు. కాగా, రాకపోకలను నిషేధించిన ఇరురాష్ట్రాల అధికారులు పోలీసులతో బ్రిడ్జికి రెండు వైపులా పటిష్టమైన భద్రతను ఏర్పాటు చేశారు. కర్ణాటక ప్రభుత్వ నిధులతో వంతెనపై 2,488 ఫీట్ల పొడవు, 20 ఫీట్ల విస్తీర్ణంలో మరమ్మతు పనులు కొనసాగుతున్నాయి. 45 రోజుల్లో పనులు పూర్తి చేస్తామని, అప్పటి వరకు వాహనాల రాకపోకలను పూర్తిగా నిషేధిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

కృష్ణా బ్రిడ్జిపై మరమ్మతులు చేపడుతున్న కూలీలు